

వసుంధర

"అన్నయ్యా—ఆ బొమ్మ చాలా బాగుంది కదూ?" అన్నాడు ఏడేళ్ళ నా తమ్ముడు రామం.

నేను మాట్లాడకుండా ముందడుగు వేశాను

రోడ్డుమీద తన కంటికి నదురుగా కనిపించిన ప్రతి వస్తువు గురించీ రామం నాతో చెబుతూనే వున్నాడు కానీ ఒక్కటీ కొనమని అడగడు. అలా అడగడం తప్పని మా ఇంటిలో అందరమూ వాడికి చెప్పాము. కానీ వాడు పసివాడు. అందువల్ల కొనమని అడగకపోయినా తన ఉద్దేశ్యాన్నీ విధంగా సూచిస్తూంటాడు వాడు. తను నచ్చిందని చెప్పిన వాటిలో ఒక్కటంటే ఒక్క వస్తువు కొనివుంటే—వాడి దృష్టి ఇతర వస్తువుల నుంచి కాస్త తప్పుకుని వుండేదేమో—

నేను మంచి ఉద్యోగమే చేస్తున్నాను. బాగానే సంపాదిస్తున్నాను. కానీ నాకు సంపాదనకు మించిన బాధ్యతలున్నాయి. ఆ బాధ్యతల వల్ల ప్రతి పైసనూ బాగా ఆలోచించి మరీ ఖర్చుపెడుతూంటాను

ప్రస్తుతం నా భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళింది. నే నొక్కడినే వుంటున్నాను. కొన్నాళ్ళపాటు వుంటాడని ఇంటి దగ్గర్నుంచి రామాన్ని తీసుకువచ్చాను. రామం నా ఆఖరి

తమ్ముడు వాడెప్పుడూ విశాఖపట్నం చూడ లేదు.

శ్రీమతి లేకపోవడం వల్ల ఖర్చులు బాగా తగ్గాయి డబ్బులు మిగుల్తున్నాయి

అదేమిటోగానీ భార్య దగ్గర లేనందుకు అందరిలా తను తపించిపోవడంలేదు. అందు వల్ల కలిగే లాభాన్ని అంచనా వేసుకుంటు న్నాడు.

నా భార్య అనుకూలవతి నా మనసుకు నచ్చిన మనిషి. తను కాపురానికి వచ్చి శారీరకంగానూ, మానసికంగానూకూడా ఎంతో సుఖపెట్టిందామె నన్ను ఇంటి ఖర్చుల విషయంలోకూడా ఎంతో పొదుపుగా వ్యవహ రిస్తుంది అందరి ఆడవారిలా చీరెలూ, నగలూ కావాలని వేధించదు సరిగదా నేను కొంటా నంటే వారిస్తుంది

మా వివాహమై నాలుగు సంవత్సరాలు కావ స్తోంది. ఈ నాలుగు సంవత్సరాలూ నాలుగు క్షణాల్లా దొర్లిపోయాయి అందుకు మరో కారణం కూడా వుంది ఈ నాలుగేళ్ళూ మేము పిల్లలు కలక్కుండా జాగ్రత్తపడ్డాము ఇప్పుడే మొదటిసారిగా పురిటికి పుట్టింటికి వెళ్ళిందామె.

ఈ నాలుగేళ్ళలోనూ నాలుగుసార్లు పుట్టిం టికి వెళ్ళింది శ్రీమతి. తండ్రి స్వయంగా వచ్చి ఆమెను పుట్టింటికి తీసుకెళ్ళాడు. మొదటిసారి ఆమె పుట్టింటికి వెళ్ళినప్పుడు ఒంటరితనంతో నేను చాలా బాధపడ్డాను. ఆమె కూడా అలానే బాధపడింది కానీ తలిదండ్రుల బలవంతంవల్ల అక్కడే అయిదారు వారాలపాటుండిపోవలసి వచ్చింది

ఈ అయిదారు వారాల్లోనూ నాకు నూట యాభై రూపాయల్పైగా కలసి వచ్చింది అప్పుడే నేను ఆమెను పుట్టింటికి పంపడం రుచి మరిగాను. నూటయాభై రూపాయలంటే సామాన్యమైన మొత్తం కాదు నాకు అందుకే ప్రతి సంవత్సరం విధిగా ఆమెను ఓ నెలరోజు లయినా వుండేవిధంగా పుట్టింటికి పంపేస్తూ వుంటాను.

ఇప్పుడు నా జేబులో కాస్త డబ్బులు ఆడు తున్నాయి. ఈసారి నా భార్య పుట్టింట్లో అయి దారు నెలలవరకూ ఉండవచ్చు. ఈ అవకాశా న్నుపయోగించుకుని కనీసం నాలుగయిదువంద లయినా పోగుచెయ్యాలి


కాస్త డబ్బు చేతిలో ఆడుతుండడంవల్లనే తమ్ముడి కోసం రెడీమేడ్‌లో ఓ జత బట్టలూ, కాళ్ళకు జోళ్ళూ కొన్నాను ఎందుకంటే రేపు నా స్నేహితుడి చెల్లెలి పెళ్ళి. ఆ పెళ్ళికి నేను వెళ్ళాలి.

ఆ స్నేహితుడు బాగా డబ్బున్నవాడు. చెల్లెలి పెళ్ళి వైభవంగా జరిపించబోతున్నాడు. ఆ పెళ్ళికి నేను వెళ్ళాలి నాతోపాటు నా తమ్ముడూ వస్తాడు నా ఆర్థిక పరిస్థితి ఎటు వంటిదయినా నేను చేస్తున్న వుద్యోగాన్నిబట్టి సంఘంలో నాకొక హోదా వుంది. ఆ హోదాను నిలబెట్టుకునే రీతిలో నేనూ, నా తమ్ముడూ అక్కడ వుండాలి అందుకే తమ్ముడికి బట్టలూ, జోళ్ళూ కొన్నాను. పెళ్ళికి ఖరీదయిన ప్రజంటేషన్ కొన్నాను

బట్టలూ, జోళ్ళూ కొనమని కమ్ముడు అడగలేదు. అయినా అవి కొన్నాను. స్నేహి తుడి చెల్లెలికోసం కొన్న ఖరీదయిన ప్రెజెం టేషన్ కూడా వాడు చూశాడు వాడి చిన్న బుర్రకు ఏం తోచిందో, వాడి పసి మనసులో ఏం ఆశలు రేగాయో తెలియదుకానీ వాడా క్షణం నుంచీ తన కంటికి నదురుగా కనిపిం చిన ప్రతి వస్తువు గురించీ నాతో చెబుతు న్నాడు

పాపం వాడికి తెలియదు - వాడి ఇష్టా ఇష్టాల ననుసరించి వస్తువులు కొనే ఆర్థిక స్తోమత నాకు లేదనీ-వాడికేమయినా కొంటే నా స్వార్థానికి సంబంధించిన ఇతర విషయాలు కారణమనీ అర్థం చేసుకునే వయసు కాదు వాడిది

ఏమైతేనేం కోరిన విధంగా—మర్నాడు పెళ్ళికి వెళ్లాం ఆ పెళ్ళి చెప్పలేనంత వైభ వంగా జరిగింది పెళ్ళికి వచ్చినవాళ్ళలో నేనూ,




నా తమ్ముడూ కూడా సమంగా కలసి పోగలిగాం.

* * *

"కమాన్ మిస్టర్ మధూ—" అన్నాను. అతనితో చేతులు కలిపేలోగా—"మిస్టర్ శంకర్—ఇప్పుడా రావడం?" అంటూ నిష్టురమాడాను అప్పుడే వస్తున్న శంకర్‌ని చూసి.

నేను నీలా బిజీగా ఉన్నాను. అవును మరి-బిజీ అంటే అంటే బిజీకాదూ—చెల్లెలి పెళ్ళి—!

ఎంతో వైభవంగా వివాహం జరిగింది. అందరూ నాన్నగారిని కాదు—నన్నే మెచ్చుకుంటున్నారు. "కుర్రాడు ఏం చలాకీ అయిన వాడండీ—ఒక్క చేతిమీద ఏం చక్కగా జరిపించాడు. ఎలాగైనా చదువుకున్నవాళ్ళ పద్ధతులే వేరు " అంటూ పొగిడేశారు.

చాలామంది నావంటి కొడుకును కన్న నాన్నగారి అదృష్టాన్నభినందించారు. నాన్నగారు తమాషాగా మీసాలు దువ్వి అదోరకమైన నవ్వు నవ్వారు. ఆ నవ్వులో గర్వముంది.

ఇప్పుడు ఆ పెళ్ళికి రిసెప్షన్ యేర్పాటు చేశాను. అది సమయం రాత్రి ఎనిమిది కావస్తోంది. కనుచీకటిగా వుంది. ఆవరణలో నేను ఎరేంజ్ చేసిన నియాన్ లైట్లు వెలుగుతున్నాయి.

నా ముఖ్య స్నేహితులు వస్తున్నారని పరుగెత్తుకు వచ్చానుకానీ అంతవరకూ రిసెప్షన్ వద్ద నేను లేను. నా ప్రాణమిత్రుడు మూర్తి, చెల్లెలి స్నేహితురాలు సుభద్రా అక్కడ వున్నారు.

అతిధులందరికీ టేబిల్ మీల్స్ యేర్పాటు చేయించాను. అందుకు కావలసిన టేబిల్సూ, కుర్చీలూ సంపాదించడానికి పలుకుబడితోబాటు డబ్బుకూడా బాగానే ఖర్చయింది. డిన్నర్ గ్రాండ్‌గా ఉండాలని నా అభిప్రాయం. అందుకే అయిటమ్స్‌లో రెండు స్వీట్సు ఇంక్లూడ్ చేశాను. మైసూర్‌పాక్, గులాబ్‌జాం, ఇవికాక చక్కెరకేళీ అరటిపళ్ళు. హోటులో పులిహోర మామూలే—ఇవికాక వెజిటబుల్ పలావ్. బంగాళాదుంపల కూర. అన్నం—పెరుగు. చదువుకునే రోజుల్లో హాస్టల్లో జరుపుకునే విధంగా అయిటమ్స్ ఎరేంజ్ చేశాను.

డిన్నర్ అనంతరం అతిధులకు సిగరెట్ ప్లస్ కిళ్ళీ. ఒక్క సిగరెట్, కిళ్ళీ, అరటిపళ్ల

తిప్ప మిగతా అయిటమ్సన్నీ ఇంట్లో తయారయినవే. ఎక్కువ ఛార్జీచేసే మంచి వంటవాళ్ళని తయారీకి కుదిర్చాను.

ఆహ్వానించిన అతిధులందరూ వచ్చేశారు. రిసెప్షన్ దగ్గరున్న బల్లలు ప్రెజెంటేషన్స్‌తో నిండిపోతున్నాయి. ఆ ప్రాంతంలోనే కూర్చుని ఉన్న నా చెల్లెలు, బావగారు తమమీద కురిసే అభినందనల పరంపరలకు తట్టుకోలేక ఉక్కిరైపోతున్నారు.

నా చెల్లెలు చాలా సిగ్గుపడుతోంది. కానీ దాని కళ్ళలో మెరుపుఉంది. మంచి హోదాలో వున్న అందమైన భర్తా, ఆ భర్త తనకు లభించిన తీరూ రెండు కలసి దానికళ్ళలో ఆ మెరుపు యేర్పడిందని నాకు తెలుసు.

"ఈడూ జోడూ యెంత బాగా కుదిరిందో చూశారా?" ఒక భార్య భర్తతో అంటోంది. "ఎందుకు కుదరదు. పదిహేనువేల కట్నం మరి" అన్నాడు భర్త.

"అయిదువేల కట్నానికే మొహం మాడ్చుకున్నాడు మీ అన్నయ్య—ఆతనికి చెల్లెలిమీద ఎంత ప్రేమ—" అంటున్నాడో భర్త.

"అవును మరి—ఇతనికి ఒకే ఒక చెల్లెలు· ఖర్చు పెట్టకేం చేస్తాడు" అంటూ జవాబిస్తోంది భార్య.

"ఒకే చెల్లెలు " అని నవ్వుకున్నాను నేను.

* * *

హఠాత్తుగా మెలకువ వచ్చింది.

ఎప్పుడూ యింతే-మంచిపెళ్ళి చూసివచ్చినప్పుడల్లా నాకిటువంటి కల వస్తూంటుంది. ఆ కల సరిగ్గా అక్కడే ఆగిపోతూంటుంది. అక్కడే ఒకే ఒక చెల్లెలు దగ్గర.

కలకీ ఇలకీ అక్కడే తేడా వుంది.

నేను పదో ఏట ఒక పెళ్ళికి వెళ్ళాను. ఆ పెళ్ళి ఒక అన్నగారి ఆధ్వర్యంలోనే చెల్లెలికి జరిగింది. ఎంతో వైభవంగా జరిగిన ఆ పెళ్ళిలో అందరూ ఆ అన్నగారిని అభినందించారు. ఆ అభినందనలు వింటున్నపుడే నాకు కోరిక కలిగింది. నేనూ నా చెల్లెలి పెండ్లి అంత వైభవంగానూ చేసి అలా అభినందనలు పొందాలని. అప్పుడే నేను చెల్లెలి పెళ్ళి గురించి కలలు కనడం మొదలు పెట్టాను. అప్పట్లో నా కల ఒకే ఒక చెల్లెలు దగ్గర ఆగేది కాదు· ఎందుకంటే అప్పటికే ముగ్గురు చెల్లెళ్ళున్నారు నాకు. అయినప్పటికీ వైభవంగా వివాహం జరిపించడం కష్టమని నాకు తెలియదు. ఎవరేనా లేపడంవల్లకానీ, మంచం మీంచి కింద పడిపోవడంవల్లకానీ నిద్రాభంగమై కల ఆగిపోయేది అప్పట్లో.

మేము ఆస్తిపరులమే మరి. బాగా పండే పదెకరాల భూమి ఉంది. బాగా చదువుకునే నేనున్నాను. కానీ

కానీ నా తర్వాత వరుసగా అయిదుగురు ఆడపిల్లలు. ఆ తర్వాత రామం.

వీళ్ళు మాకు దక్కినవాళ్ళు. దక్కకుండా పోయినవాళ్ళు ముగ్గురున్నారు. అందులో ఇద్దరు పురిట్లోనే పోయారు. ఒకడు మూడేళ్ళు మాత్రం బ్రతికాడు. ఇవికాక అమ్మకు ఒకసారి గర్భస్రావమయింది.

పిల్లల మూలంగా అమ్మ ఆరోగ్యం చెడింది. అందరినీ ఆమె సమర్ధించుకు రాలేకపోయేది. సరయిన ఆలనా పాలనాలేక పిల్లల ఆరోగ్యాలు కూడా అంతంతమాత్రంగా వుండేది· ఫలితంగా నాన్నగారి బడ్జెట్‌లో మందులకింద చాలా ఖర్చయ్యేది.

నా చదువు పూర్తికాకుండానే మొదటి చెల్లెలి పెళ్ళి చేశారు నాన్నగారు. ఈ పెళ్ళిలో నా పాత్ర ఏమీ లేదు. పెళ్లి సామాన్యంగానే జరిగిపోయింది. నా కలలో పెళ్లికీ దీనికీ సామ్యం లేదు. అమ్మ దగ్గర ఒకటి రెండుసార్లు గొణిగాను-పెళ్లికి ఇంకా స్త ఖర్చుచేసి వుండవలసిందని.

అమ్మ నవ్వి—"బాగుందిరా - మనకిద్దొక్కర్తే ఆడపిల్లేమిటి? ఇంకా నలుగురున్నారు" అంది.

అప్పుడే నాకో భయం కలిగింది. ఆ

భయం ఇది అని చెప్పలేనుకానీ అప్పట్నుంచీ నా కల ఒకేఒక్క చెల్లెలు దగ్గర ఆగిపోతోంది.

అయినా నా కలలో నాకు ఒకే ఒక చెల్లెలు. లేకపోతే కలలో కూడా అలాంటి వివాహం నేను చేయలేను.

నేను యమ్మెస్సీలో వుండగా నా రెండో చెల్లెలి వివాహం జరిగింది. మొదటి వివాహం కంటే తీసికట్టుగా జరిగింది. ఈసారి నేనేమీ మాట్లాడలేకపోయాను.

నేను వుద్యోగంలో ప్రవేశించాక ఇంటి పరిస్థితులు బాగా అర్థం అయ్యాయి. నాన్న గారి యిబ్బందులు అర్థం కాసాగాయి. కానీ కానీ ఎవరా ఇబ్బందులకు కారకులు అని ఆలోచించినప్పుడల్లా ఆయనమీద జాలి కలగదు.

ఆయనకు చాలా అప్పులున్నాయని తెలుసుకుని నా జీతంలోంచి వీలయినంత ఎక్కువగా ఆయన కోసం కేటాయించసాగాను. చెల్లెళ్ళ పెళ్ళయ్యేవరకూ వివాహం చేసుకోకూడదనుకున్నాను. కానీ చెల్లెలి పెళ్ళి కోసమే-నేనూ వివాహం చేసుకోవలసి వచ్చింది. బజార్లో నా ధర పదివేలు పలికింది.

నా పెళ్ళయిన ఏడాదికి నా మూడో చెల్లెలి వివాహం జరిగింది. ఈసారి కార్యక్రమాలలో కొంత ప్రాముఖ్యత వహించాను. కానీ ఇలలోని నేను కలలోని నేను కాదు. కలలో అయితే నాకు ఒకే ఒక్క చెల్లెలు

నాకు చాలా బాధ అనిపించేది. నా కల అతి సులభంగా ఇలలో నెరవేరేది. కానీ నాన్నగారందుకు సహకరించలేదు. అందుకు పూర్తిగా ఆయన్ను తప్పుపట్టలేము. ఆయన పూర్వకాలపు మనిషి సంస్కారమేకానీ చదువు లేదు.

ఆయన వ్యవసాయంలో ఆరితేరినవారు. కానీ పొలంలో కలుపు మొక్కలు చేసేహాని జీవితంలో ఎక్కువమంది పిల్లలు చేస్తారని ఆయన వూహించలేదు.

ప్రస్తుతం నాలుగో చెల్లెలికి సంబంధాలు చూస్తున్నాం మేము. వీలయినంత చవుకలో తేల్చేయాలాని ప్రయత్నిస్తున్నాం. చౌక అనుకున్నప్పుడల్లా నా మనసులో ఏ మూలో బాధ కలుగుతూంటుంది.

ప్రస్తుతం కలగా కంటున్నది—కొంత కాలానికి కలగానయినా మిగలదనే భయం నాకుంది. ఎందుకంటే క్రమంగా నా కలలో బలం తగ్గుతోంది. ఒకప్పుడు రాత్రి తెల్లవార్లూ వచ్చేటంత పెద్దదిగా వుండే ఆ కల యిప్పుడు ఓ పావుగంటకు మించి వుండడంలేదు.

ఆ కల నన్ను తాత్కాలికంగానైనా ఆనంద లోకాల్లో విహరింపజేస్తోంది. ఆ కల కూడా నాకు దూరమైతే ”

“సార్ టెలిగ్రామ్.”

అందుకున్నాను. ఒక్కసారి ఆనందంతో పొంగిపోయాను. నాకు కూతురు పుట్టిందట.

అవును-నేనో ఆడపిల్ల తండ్రినయ్యాను. దాన్ని నా ఆశయాలకు అనుగుణంగా పెంచి ఇరవై ఏళ్ళ తర్వాత పెళ్ళి చేస్తాను.

పెళ్ళి .

పెళ్ళి అత్యంత వైభవంగా జరగాలీ పెళ్ళి.

నలుగురూ మెచ్చేలా చేస్తానీ పెళ్ళి!

తన పెళ్ళిలో అందరూ నా కూతురి అదృష్టాన్నభినందించాలి “ఆమెకేమండీ ఆ తండ్రికి ఒక్కగానొక్క కూతురు ” అని అంతా అనుకోవాలి.

ఒక్కగానొక్క కూతురు

అవును. ఇది నా చేతుల్లోనే వుంది. నాన్నగారు చేసిన తప్పు నేను చేయకూడదు.

ఫరవాలేదు. ఈరోజునించీ నేను కొత్త కలను కనడం ప్రారంభించవచ్చు. ఈ కల మధ్యలో ఆగేది కాదు! రాత్రితెల్లవార్లూ నన్నానందపరచి-ఇరవై ఏళ్ళ అనంతరం ఇలలో కూడా జరుగుతుంది.